నేటికీ పుంత రోడ్డే దిక్కు!


బ్రాహ్మణచెర్వులో కోతుల గుండం మంచినీటి చెరువు పుంతరోడ్డు


వెలగలవారిపాలెం రోడ్డులో అభివృద్ధి చేసిన మంచినీటి చెరువు

- వైఎస్సార్ నగర్ నుంచి కోతుల గుండం మంచినీటి చెరువు మట్టి రోడ్డే
- రాకపోకలకు ఇబ్బందులు
- విద్యుత్ సౌకర్యం లేక రాత్రయితే చీకటే

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో బ్రాహ్మణచెర్వు వైఎస్సార్ నగర్ నుంచి కోతుల గుండం మంచినీటి చెరువు వరకు ఉన్న పుంత రోడ్డును అభివృద్ధి చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మార్టేరు – పెంటపాడు స్టేట్ హైవే నుంచి పాలమూరు – పాదలాడ (వెలగలవారిపాలెం) ఆర్ అండ్‌బీ రోడ్డుకు లింకు రోడ్డుగా ఉన్న ఈ పుంత మార్గాన్ని అనుకుని అనేక మంది ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఈరోడ్డులో కనీసం గ్రావెల్ కూడా వేయకపోవడంతో స్థానికులు వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రయితే నరకం చూస్తున్నారు. ఈ రోడ్డును ఆనుకుని పక్కనే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సుమారు 350 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. తదపరి వచ్చిన ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ నగర్‌లో ఇళ్లు నిర్మించి కొన్ని రోడ్లను సీసీ రోడ్లగా అభివృద్ధి చేశారు. దీనికి సమీపంలో వెలగలవారిపాలెం రోడ్డులో ఉన్న కోతుల గుండం మంచినీటి చెరువును ఆజాదీకా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని సుమారు రూ.2 లక్షలతో అభివృద్ధి చేశారు. చెరువుకు దాతల సహకారంతో రేవులను గ్రామ పంచాయతీ నిర్మించింది. అయితే స్టేట్ రోడ్డు నుంచి చెరువు వద్ద వరకు సుమారు 500 మీటర్ల మేర ఉన్న మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తే ఆ ప్రాంత ప్రజలు బ్రాహ్మణ చెర్వు వెళ్లాల్సిన పని ఉండదు. మార్టేరు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గర దారి. ఈ మార్గన్ని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రాకపోకలకు అవస్థలు



వైఎస్సార్ నగర్ నుంచి స్టేట్‌హైవేకు వెళ్లాలన్నా మంచినీటి చెరువుకు వెళ్లాలన్నా ఇదే రహదారి. గత 20 ఏళ్లుగా ఈ రోడ్డుపై కనీసం గ్రావెల్ కూడా వేయకపోవడం వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉంటోంది. తక్షణమే గ్రావెల్ రోడ్డును నిర్మించి రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– బొంతు ఆదిలక్ష్మి, గృహిణి, వైఎస్సార్ నగర్, బ్రాహ్మణ చెర్వు

పాముల భయం



వర్షాకాలం వస్తే బయటకు వెళ్లే పరిస్థితి లేదు. 15 ఏళ్ల క్రితం ఈ రోడ్డులో ఇళ్లు నిర్మించుకున్నారు. రహదారి సరిగా లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. రాత్రి సమయంలో పాముల భయం వెంటాడుతోంది. ఈ మార్గంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

– కౌరు మీరా, గృహిణి, బ్రాహ్మణచెర్వు

క్లుప్తంగా

భూ సర్వేకు సహకరించాలి


దేవలో భూ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు

పెనుగొండ: భూసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు జి.అనితకుమారి కోరారు. సోమవారం దేవలో రైతు సమక్షంలో భూ సర్వే నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలో జగనన్న ఇళ్ల స్థలాలను పరిశీలించి, అర్హులు, అనర్హులు జాబితాలను సిద్ధం చేయాలని వీఆర్వోలకు సూచించారు. తామరాడలో మూసి ఉన్న పంట బోదేను పరిశీలించారు.

చెత్త యూనిట్ వద్దంటూ నిరసన


మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

నరసాపురం: మున్సిపల్ కార్యాలయం సమీపంలో తడి, పొడి చెత్తను వేరుచేసే యూనిట్‌ను ఏర్పాటును నిరసిస్తూ సోమవారం స్థానికులు వైఎస్సార్‌సీపీ పిరాయింపు కౌన్సిలర్ కేసరి గంగరాజు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. చెత్తను మున్సిపల్ కార్యాలయం వద్ద స్థలంలో వేయడం వల్ల స్థానికంగా ఉండలేమని, ఆనారోగాల భారిన పడతామని తెలిపారు. స్థానికంగా వ్యాపారులు సాగవని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. సీఐ బి.యాదగిరి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. కమిషనర్ ఎం అంజయ్య మాట్లాడుతూ యూనిట్ తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నామని నచ్చజెప్పారు.

ఆలయాల ఈఓగా రామచంద్రకుమార్


రామచంద్రకుమార్

నరసాపురం రూరల్: స్థానిక అమరేశ్వర స్వామి గ్రూపు ఆలయాల కార్యనిర్వాహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్‌కు నరసాపురం అర్బన్, రూరల్, యలమంచిలి మండలాల్లోని మరో ఐదు ఆలయాల ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపురం అర్బన్‌లో ఆదికేశవ ఎంబర్‌మన్నార్ స్వామి, మదన గోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి, నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి, యలమంచిలి మండలం వైవీ లంక గ్రామంలోని మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాల వోగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

టీ షర్టుల బహూకరణ


విద్యార్థులకు టీ షర్టులు అందించిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరం ప్రాథమిక పాఠశాల–2 విద్యార్థులకు దాత నడపన జగపతిరావు విరాళంతో టీ షర్టులను అందజేశారు. హెచ్‌ఎం వి.బేబీ సరోజ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఏలేటి కిషోర్, వైస్‌చైర్మన్ వాడపల్లి జ్యోతి, సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో విజయకేతనం


క్రికెట్ విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: గుంటూరు జెకెసి కళాశాలలో నిర్వహించిన చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ఫర్ ఏపీ కాలేజీ టీచర్స్ పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ టీచర్స్ టీం విన్నర్స్‌గా నిలవడం అభినందనీయమని కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కె.వి మురళీకృష్ణంరాజు అన్నారు. విజేతలను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా మాట్లాడారు. ఈనెల 16వ తేదిన జరిగిన ఫైనల్స్‌లో ఏపీ ఎస్ఆర్‌ఎం యూనివర్సిటీ జట్టుపై రెండు వికెట్ల తేడాతో తమ కళాశాల అధ్యాపకుల టీమ్ విజయం సాధించిందని గత 28 ఏళ్లుగా జరుగుతున్న చందూస్ క్రికెట్ టోర్నమెంట్లో ఎస్ఆర్‌కెఆర్ అధ్యాపక బృందం నాలుగు పర్యాయాల్లు విన్నర్స్‌గా, ఐదుసార్లు రన్నర్స్‌గా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవికిరణ్‌వర్మ, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్ హరిమోహన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు నివాళి


కాండ్రేగులకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కొడమంచిలి సోసైటీ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం కొడమంచిలిలోని కాండ్రేగుల నివాసంలో సత్యనారాయణ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కాండ్రేగుల మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని శ్రీరంగనాథరాజు అన్నారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, మాజీ జెడ్పీటీసీ ముప్పాల వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు యల్లమెల్లి బేబీ రాజేష్, ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మన్నే సుబ్బారావు, సాక సురేష్, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, శీలబోయిన నాగేంద్ర, కోటి శశి మధు, పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్, చికిలే శేఖర్, బొరుసు రాంబాబు, పుచ్చకాయల నాగార్జునలు పాల్గొన్నారు.

కవురుపాలెంలో

ఆచంట కవురు పాలెంలో వైఎస్సార్ సీపీ నేత కేతా ఆంజనేయులు తండ్రి రామారావు మృతికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సంతాపం వ్యక్తం చేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్య పేరిట వీడియో కాపీ.. ఆచూకీ లభ్యం

నరసాపురం రూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో విడుదల చేసిన వ్యక్తి ఆచూకీ లభ్యమయింది. బాధితుడు కడప నుంచి భార్యకు ఫోన్‌చేసి బాగానే ఉన్నానని సమాచారం ఇవ్వడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారు పేటకు చెందిన యర్రంశెట్టి సతీష్ ఆదివారం బైక్‌పై మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి అప్పుల పాలయ్యానని, ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ వీడియో తీసి స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపించాడు. దీంతో అతని సోదరుడు భార్గవరామ్ మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొగల్తూరు ఏఎస్సై బండి సత్యనారాయణ మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. పేరుపాలెం బీచ్‌లో సతీష్ సెల్‌ఫోన్, బైక్ లభ్యమయ్యాయి. సతీష్ సముద్రంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అంతా భావించగా, సోమవారం సాయంత్రం కడప నుంచి సతీష్ భార్యకు ఫోన్‌చేసి బాగానే ఉన్నానని సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువు గట్టున పునర్నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా జరిగింది. అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం స్వామివారికి తమలపాకులు, గంగ సిందూరంతో ప్రత్యేక పూజలు చేశారు. సువర్చల సహిత హనుమాన్ రథోత్సవం ఆలయం నుంచి ఏటిగట్టు, శివాలయం, మార్కెట్ సెంటర్, మూలస్థానేశ్వరి దేవి ఆలయం మీదుగా తిరిగి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంది. సుమారు మూడు కిలో మీటర్ల మేర ఆరు గంటలు సాగిన రథయాత్రలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని రథాన్ని లాగారు. ప్రతి ఇంటి వద్దా స్వామికి మహిళలు హారతులు పట్టారు. రాత్రి హైదరాబాద్‌కు చెందిన నృత్య గురువు డాక్టర్ ఎస్వీ భారతి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముదునూరి


అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నరసాపురం మండలం ఎల్బీచర్ల గ్రామంలో మహాగణపతి ఆలయ ప్రతిష్ఠ, మొగల్తూరు మండలం కేపీపాలెం తూర్పుతాళ్లు సెంటర్‌లో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, ఆయా గ్రామాల పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


చింతపర్రులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొల్లు అర్బన్ : రైతుల కొబ్బరి చెట్లకు ఉపాధి కూలీలతో పల్లాలు తవ్వుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో ప్రతి ఉపాధి కూలికి ఏడాదికి నూరు రోజులు పని కల్పించే లక్ష్యం నెరవేరుతుందని ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఈ ఏడాది 28 పనులు పంట బోదెలు తవ్వకం ద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించినట్టు ఆయన చెప్పారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ జియావుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ బి ప్రభాకరరావు ఉన్నారు.

రాములోరికి మహా కుంభాభిషేకం

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో స్వామి వార్లకు అష్టబంధన సంప్రోక్షణ మహా కుంభాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. మరో భద్రాద్రిగా వెలుగొందుతున్న కొల్లేరు తీరంలోని కోదండ రామాలయాన్ని నిర్మించి 30 సంవత్సరాలైన సందర్భంగా అష్టబంధన మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకాలు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆఖరి రోజు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద కుంభారాధన, ఉక్త హోమం, ప్రదక్షిణ, వాస్తు హోమం, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, బ్రహ్మ ఘోష కార్యక్రమాలను అర్చకులు పీవీఎస్ రామత్రినాథ్ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నసమారాధన నిర్వహించారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి


ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

నరసాపురం: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని ఏపీయూడబ్ల్యూజే నరసాపురం నియోజకవర్గ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, బలమైన చట్టాలు అమల్లోకి తేవాలని డిమాండ్‌చేసింది. మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా విలేకరిపై అధికార పార్టీ నేత దాడిచేసి చంపుతానని బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఇజ్రాయిల్, ఎన్ మారుతీరావు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మద్దాల మురళి, జి.కాంబాబు, అనంతబాబీ, జీవన్, సందీప్, రాజేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పెనుగొండ: మన్యం జిల్లా పార్వతి పురంలో విలేకరిపై దాడి చేసిన టీడీపీ నాయకునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్‌లు డిమాండ్ చేశాయి. సోమవారం పెనుగొండ, ఆచంట మండలాల్లో తహసీల్దార్లుకు వినతి పత్రాలు అందజేశాయి. ఆయా మండలాల్లోని విలేకర్లు పాల్గొన్నారు.

బీసీ సంఘం అధ్యక్షురాలిగా దుర్గా రాజేశ్వరి


రాజేశ్వరికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: బీసీ సంక్షేమ సంఘ మండల మహిళా అధ్యక్షురాలిగా గంగడపాలెం గ్రామానికి చెందిన గుబ్బల దుర్గా రాజేశ్వరి నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యలమంచిలి మండల సమావేశం సోమవారం గంగడపాలెం గ్రామంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని మాట్లాడుతూ జనాభాలో సగం మంది ఉన్న మహిళలకు రాజకీయంగా కూడా సగ భాగం ఉండాలని సంఘంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గా రాజేశ్వరికి నియమాక పత్రాన్ని అందజేశారు. ముత్యాలరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని మతాలకు చెందిన వారిని గుర్తించి సంఘంలో పదవులు ఇస్తున్నట్టు చెప్పారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, జన గణనలో కుల గణన చేయాలని, బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఏ బీ సీ డీలుగా విభజించి అమలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో బీసీ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు, ఇల్లింగి వర్మ, కోలాటి పెద్దిరాజు, గుబ్బల రంగారావు, నాగ శ్రీనివాస్, అనిశెట్టి సత్యవతి, గుబ్బల బేబి సరోజిని, జట్లా ధనలక్ష్మి, కొల్లు గంగా భవాని, ఓయిద జయంతి, విశ్వనాధపల్లి రామలక్ష్మి, గ్రామ పెద్దలు, బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థితి


సిద్ధాంతం పాఠశాలకు కంప్యూటర్ అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని కాకినాడ సీనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాస్ అన్నారు. సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 విద్యా సంవత్సర పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సాయంతో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. 1998–99 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు అందించిన కంప్యూటర్‌ను పూర్వ విద్యార్థి సీనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), చిట్టూరి నాగరాజు, పొలూరి పోతురాజు, నరశ సురేష్, జయవరపు ప్రదీప్, కంచర్ల సుబ్రహ్మణ్యం, బొంతు శ్రీనుబాబు, కుడిపూడి సురేష్, గొల్లవిల్లి సత్యనారాయణ, స్కూలు ప్రధానోపాధ్యాయుడు కేఎస్‌వీవీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్‌కి ఐరన్ గేటు అందజేత

పాలకొల్లు అర్బన్: స్థానిక అంజలి మానసిక వికలాంగుల పాఠశాలకు రూ.20 వేలు విలువైన ఐరన్ గేటును సోమవారం అందజేసినట్టు స్కూల్ కోఆర్డినేటర్ ఎం ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీ వనితా క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ అధికార పర్యటనలో భాగంగా ఐరన్ గేటు అందజేశారని పేర్కొన్నారు. శాంతి శాస్త్రి హోమ్ అనాథ శరణాలయానికి కిరాణా సరుకులు, ప్రభుత్వ పాఠశాలకు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్ అందజేశారని వివరించారు. వాసవీ వనిత క్లబ్ అధ్యక్షులు బొండాడ శేషకుమారి, కార్యదర్శి వంకాయల మాలతి, కోశాధికారి వేమ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెనుగొండ: స్థానిక లింగాల వీధిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాం నుంచి ఆలయ అర్చకుడు కొండవీటి సత్యనారాయణ మూర్తి ఉమాసోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం రాత్రి వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉమాసోమేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఉండిలో 7,410 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

ఆకివీడు: పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉండి నియోజకవర్గంలో 7,410 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 10 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఆకివీడు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 2049 మంది ఓటర్లు, ఉండి మండల కేంద్రంలో 2 పోలింగ్ బూత్‌లలో 1532 మంది ఓటర్లు, కాళ్ల మండలంలోని 2 పోలింగ్ బూత్‌లలో 1465 మంది ఓటర్లు పాలకోడేరు మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో 3 పోలింగ్ కేంద్రాల్లో 2324 మంది ఓటర్లు ఓటు హక్కును ఈ నెల 27న వినియోగించుకోనున్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

నరసాపురం: ఆధార్ అప్‌డేట్, చిన్న పిల్లలకు ఆధార్ నమోదు కోసం పట్టణంలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు స్కావెంటర్స్ కాలనీ సచివాలయం వద్ద, గౌతమి కళాశాల, మున్సిబ్‌గారి వీధి సచివాలయం వద్ద, ఈనెల 24 నుంచి 28 వరకు చినమామిడిపల్లి, టేలర్‌పేట సచివాలయాలు, గౌతమి కళాశాల వద్ద క్యాంపులు పనిచేస్తాయని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు క్యాంపుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసాపురం: స్థానిక 2, 31 వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పనుల్లో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని యజమానులకు సూచించారు.

యానాదుల సమస్యలపై వినతి


ఆర్డీఓకు సమస్యలు వివరిస్తున్న గురుప్రసాద్

నరసాపురం: యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పాలకొల్లుకు చెందిన యానాదులతో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీఓ దాసి రాజుకు సమస్యలు వివరించారు. ఇప్పటికీ చాలామంది యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు లేవని గురుప్రసాద్ తెలిపారు. యానాదుల పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్లాస్టిక్ వస్తువులను విడనాడి, గుడ్డ సంచులనే వాడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో 120 మంది ప్రయాణికులకు నార సంచులను ఉచితంగా అందజేశారు. ఆర్టీసి డిపో మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.